

"రేఖా...."

ఆనందరావు నిద్రమత్తులో మంచం మీద అటు ఇటూ దొర్లుతూ - రెండు మూడుసార్లు పిలిచాడు.

సమాధానం రాలేదు. రాదని మరుక్షణమే స్ఫురించింది. ఐదుసంవత్సరాల అలవాటు.

ఆదివారంనాడు - మధ్యాహ్నం భోంచేసి, సాయంత్రం వరకు నిద్రపోయి, ఆ తర్వాత రేఖ ఎంత మంచి టిఫిన్ తయారుచేసినా, తిననని వూరికే మొరాయించి, బ్రతిమలాడించుకుని, తినిపించేలా చేసి, ఇద్దరూ కలిసి - పొలాలవైపు షికారుకు వెళ్లడం అలవాటు.

ఇవాళ రేఖలేదు.

ఇల్లంతా చీకటిగా వున్నట్లనిపించింది.

రేఖ మళ్లీ వస్తుందా?

ఏమో...రాదేమో....

ఐదు సంవత్సరాలపాటు పెంచిపెద్దచేసిన భార్యాభర్తలు అనుబంధ వృక్షాన్ని - ఒక్కసారిగా కూకటి వ్రేళ్లతో పెకలించి వెళ్లిపోయింది.

ఆనందరావు మగతగా కళ్లు మూసుకున్నాడు. ఆ చీకట్లో కూడా మళ్లీ రేఖ.....

అసలు రేఖ పట్ల తను ఎలా ఆకర్షితుడయ్యాడో? ఆమె ధోరణిలో ఎంత నిర్మోహమాటం... ఎంత నిర్భయత్వం... నగటు వనితల్లో మామూలుగా కనిపించే ఒక రకమైన కృత్రిమత్వం, నంగి నంగి వ్యవహారాలు రేఖలో ఎంతమాత్రం కనిపించలేదు. అందువల్లే ఆమె అంటే ఆకర్షణ, ఇష్టం ఏర్పడ్డాయి.

# అంతర్వాహిని

"ఏ విషయంలోనైనా పురుషులకొక న్యాయం... స్త్రీలకొక న్యాయం... ఏమిటీ అన్యాయం?" అని ఆమె ఎవరితోనైనా వాదిస్తున్నప్పుడు... ఆమె వ్యక్తిత్వానికి, ధైర్యానికి తను ముగ్ధుడయ్యేవాడు.

తను ఆమెనే పెళ్లి చేసుకుంటానని పట్టుపట్టినప్పుడు, పెళ్లికి అంగీకరించడానికి ముందు - తనను ఇంటర్వ్యూ చెయ్యాలంది-రేఖ. అది తనకు తమాషాగా తోచింది. సరేనన్నాడు.

అప్పుడు ఆ గదిలో వున్నది తామిద్దరే.

"మిమ్మల్ని ఒక యువతికి పరిచయం చేశాననుకోండి. ఆ అమ్మాయి మీకు షేక్‌హాండ్ యిస్తే - మీరు చెయ్యి కలుపుతారా? 'నమస్కారం' అని చేతులు జోడిస్తారా?" అని అడిగింది రేఖ.

"నేనూ షేక్‌హాండ్ యిస్తాను."

"వూ.... మీ భార్యను మీరు ఎవరికైనా పరిచయం చేస్తున్నప్పుడు, అప్పుడు ఎవరైనా ఆమెకు షేక్‌హాండ్ యిచ్చారనుకోండి. అప్పుడు మీరెలా రియాక్ట్ అవుతారు?"

"రియాక్ట్ కావడానికి అందులోఏముంది?" అన్నాడు తను నవ్వుతూ.

"ఐసీ.... సరే... మరోపాయింట్.. మీ సమక్షంలో మీ భార్యను "మీరు చాలా అందంగా వున్నారు" అని కానీ, "మీ భార్య చాలా అందంగా వుంది" అని మీతో కానీ ఎవరైనా అంటే, అప్పుడు మీరేమంటారు?"

"నాతో ఎవరైనా నా భార్య అందంగురించి మెచ్చుకుంటే, "థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్" అని అంటాను."

".... ఓ ఐలైక్‌యు... ఐలైక్ యు వెరీమచ్... మీ విశాల మనస్తత్వం నాకు

నచ్చిందండీ' అంది రేఖ నవ్వుతూ ఆ నవ్వులో ఎంత అమాయకత్వం....!

రేఖతో పెళ్లయిన మూడు సంవత్సరాలవరకు అంతా సవ్యంగానే సాగింది. ప్రతి సంవత్సరం - 15 రోజులు సెలవుపెట్టి 'సైట్ సీయింగ్'కు వూళ్లన్నీ తిరుగుతూ-సరదాగా కాలక్షేపం చేయడం అలవాటైంది.

తనకు షుగర్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ నుంచి బిజినెస్ మేనేజరు పదవికి ప్రమోషన్ వచ్చింది. ఎక్కువ ఆదాయం..... ఎక్కువ సౌకర్యాలు....

ఉన్నట్టుండి - రేఖలో అసంతృప్తి ప్రారంభమైంది. "ఆనంద్... నాకు ఈ లైఫ్ చాలా బోరుగా వుంది" అని ఒకరోజు బాంబ్ ప్రేల్చింది.

నిజమే. తన ఉద్యోగం అలాంటిది. సాధారణంగా ఏ షుగర్ ఫ్యాక్టరీ అయినా - టౌన్‌కు దూరంగా ఏ పల్లెటూళ్లోనో వుంటుంది. అక్కడ - ఉద్యోగుల కోసం. ఆఫీసర్లకోసం - వుండే క్వార్టర్స్‌లోనే ప్రపంచాన్నంతా చూసుకోవాలి.

మేనేజర్ భార్య కావడంతో, ఆమెతో మరీ చనువుగా వుండడానికి — క్వార్టర్స్‌లో వున్న తక్కిన ఉద్యోగస్తుల భార్యలు జంకుతూ వుండేవారు. వాళ్లు ప్రదర్శించే అతి వినయాలు రేఖకు అసలు నచ్చేవి కావు.

ఇంటి పనులకు - పనిమనిషి వుంది. సాయంకాలం తను ఫ్యాక్టరీ నుంచి - ఇంటికి వచ్చేవరకు - పుస్తకాలు, విడియోలో సినిమాలు తప్ప - మరో కాలక్షేపం వుండేది కాదు. అవి కూడా ఎన్నిరోజులని?

తన ఎమ్.కామ్ చదువు, తన తెలివితేటలు అన్నీ మూలపడిపోయి, కేవలం - పంజరంలో రామచిలుకలా, బందీ అయిపోయినట్లు వూహించుకోవడం ఆరంభించింది రేఖ.




పెళ్లి కాకముందు చైతన్య ఉద్యమాలూ, కార్యకర్తలను సమీకరించుకుని, ఏవేవో కార్యక్రమాలు నిర్వహిస్తూ వుండేది. వీరావేశంతో ఉపన్యాసాలు యిచ్చేది. ఇప్పుడు అటువంటివాటికి అవకాశాలు లేకపోవడంతో ఆమెను పూర్తిగా నిరుత్సాహం ఆవరించింది.

అప్పటికీ తను రేఖను ఎంతగానో అనునయించే వాడు. కావాలని ఏదో అంశంపై వాదనకు దించి, ఆమెచేత వ్యాసాలు రాయించేవాడు. అవి పత్రికల్లో ప్రచురిత మయ్యేవి. అయినా ఆమెకు సంతృప్తి కలిగేది కాదు.

"ఇవన్నీ బూర్జువా పత్రికలు... ఒక పక్కన 'స్త్రీ - బజార్లో దొరికే అందాల బొమ్మకాదు... విలువ కట్టి అమ్మడానికి' అని వ్యాసాలు ప్రచురిస్తాయి. మరో పక్క అందాలపోటీల గురించి రాస్తాయి.... 'కారెక్టర్' లేని పత్రికలు... ఉద్యమాలు లేవదీసి, వీళ్లందరికీ బుద్ధి చెప్పాలి" అని ఆవేశంగా మాట్లాడేది.

అనుకోకుండా - తనకు మరో గొప్ప అవకాశం వచ్చింది. అది - మద్రాసుకు సమీపంలో వున్న పెద్ద షుగర్ ఫ్యాక్టరీలో బిజినెస్ మేనేజర్ ఉద్యోగం! అక్కడ ఎక్కువ వసతులున్న బంగళా... ఎక్కువ జీతం... ఎక్కువ సౌకర్యాలు... ప్రత్యేకించి ఒక కారు!

స్థలం మార్పువల్ల - రేఖలో ఎలాంటి మార్పూ రాలేదు. పైగా ఆమె అసంతృప్తి రోజురోజుకు పెరుగుతూ వచ్చింది!

"మీరు బూర్జువా మనుషులు.... ఏసీ గదులు, విందులు... వినోదాలు.... విలాసాలు.... ఇదేనా జీవితం" అని తనమీద విరుచుకుపడితే, ఆరంభంలో నవ్వుకునేవాడు.

కానీ అదే పనిగా - తిరస్కార భావంతో అలా మాట్లాడడం ఒక అలవాటుగా పరిణమించేసరికి తనకూ అసహనం ఏర్పడింది.

ఎప్పుడైనా చిరాకుపడితే, మరింతగా రెచ్చిపోయేది రేఖ.

సరే...ఈ గానుగెద్దు జీవితం వద్దు అంటే— ఇంకేం చేయాలి? ఈ ఉద్యోగం మానేసి— ఏ సిటీకైనా వెళ్లి - అక్కడ ఇద్దరం కలిసి ఉద్యోగాలు చేసుకోవచ్చునట. అవి క్లర్క్ ఉద్యోగాలైనా ఫరవాలేదట...అప్పుడు అవి మాత్రం గానుగెద్దు జీవితాలు కావా?

ఎంత అవివేకం...ఈ రోజుల్లో క్లర్క్ ఉద్యోగాలైనా - అంత తేలికగా దొరుకుతున్నాయా దొరికినా - ఆ జీతాలు బ్రతకడానికి సరిపోతాయా?

వీరావేశంలో వున్నవాళ్లకు బుద్ధి సరిగ్గా పనిచేయదన్నమాట నిజమే. రేఖ మాటలనీ విని తను నవ్వుకున్నాడు.

"మనం సంఘసేవ చెయ్యలేకపోయినా, మన వల్ల సంఘానికి ఎలాంటి అపకారం జరగడంలేదు. కాబట్టి అందుకు సంతృప్తిపడుతూ, సంతోషించు" అనేవాడు ఆమెను నవ్వించడానికి ప్రయత్నిస్తూ.

కానీ ఆమె ధోరణి మారలేదు.

"ఐయామ్ నాట్ ఎ సెక్సీ డాల్ ఫర్‌యు...." అని ఆ రోజు రాత్రి ఆ మాట అన్నందుకు తనకు నిజంగానే చాలా కోపం వచ్చింది.

ఆవేశాన్ని అణచుకోలేక చెంప ఛెళ్లుమనిపించాడు. అంతే! జరగకూడనిది జరిగిపోయింది.... రేఖ వెళ్లిపోయింది.

తను రేఖను ప్రేమించాడు.

ఆరాధించాడు.

ఇప్పుడూ రేఖ అంటే తనకు ఇష్టమే. కానీ - నిష్కారణంగా రేఖ తన హృదయాన్ని గాయపరచింది.

అది ఎలా సహించడం?

* * *

ఉరుములు, మెరుపులూ లేకుండా గాలివానలా - సూట్‌కేస్‌తో దిగిన కూతుర్ని చూడగానే - మీనాక్షి పండుటాకులా విలవిలలాడిపోయింది.

"అల్లుడుగారు రాలేదమ్మా" అని రేఖ వంకచూస్తూ - జంకుతూనే అడిగింది.

'వూ' అని ఏదో గొణుక్కుంటూ-లోపలికి వెళ్లిపోయింది రేఖ.

"అంతే.... ఏదో జరిగే వుంటుంది...." బరువుగా నిట్టూర్చింది - మీనాక్షి.

అబ్బాయి.... బుద్ధిమంతుడు... అప్పుడప్పుడు తమ కుటుంబానికీ ధన సహాయం చేస్తున్నాడు... ఈ రోజుల్లో అటువంటి అల్లుడు ఎక్కడ దొరుకుతాడని తను మురిసిపోయింది. అతని సహాయంతో ఎలాగోలా తక్కిన ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లూ చేయవచ్చని సంబరపడిపోయింది.

తన భర్త - బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నా - అల్లుడు మంచి ఉద్యోగస్తుడైనందుకు - పైగా కోరి రేఖను - కానీ కట్నం పుచ్చుకోకుండా పెళ్లి చేసుకున్నందుకు - తమ అదృష్టానికి ఎంతగానో సంతోషించింది.

కానీ... అది మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది.

ఏదో పెద్ద గొడవే జరిగి వుంటుంది.... ఈ సమయంలో ఆయనా వూళ్లోలేడు... 'కాంప్' అని వెళ్లిపోయాడు... ఎప్పుడొస్తాడో... ఏ మౌతుందో...

మీనాక్షి బరువుగా కాళ్లీడ్చుకుంటూ - వంట గదివైపు వెళ్లింది.

రేఖను చెల్లెళ్లు రకరకాలుగా ప్రశ్నిస్తూ వుంటే, విసుగ్గా జవాబులు చెబుతూ వుండడం - మీనాక్షికి వినిపిస్తూనే వుంది.

మీనాక్షి ఆలోచనలు పరిపరివిధాలుగా పరుగులు తీయసాగాయి.

"స్త్రీ జీవితానికి కొన్ని పరిమితులున్నాయి. అన్ని విషయాల్లోను స్త్రీలు పురుషులతో పోటీపడి సాధించలేరు" అని తను రేఖతో ఎన్నో సందర్భాలలో నచ్చజెప్పడానికి ప్రయత్నించింది. కానీ తన మాట వింటేకదా....

"స్త్రీ పురుషుడికి ఏ విషయంలో తీసిపోతుంది?" అని వాదించేది." "పురుషుడికి మనం బానిసల్లాపడి వుండనక్కరలేదు" అనేది.

"మన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ, పురుషుడి నాయకత్వాన్ని అంగీకరించాలి. గృహిణిగా మన బాధ్యతలు నిర్వహించడం బానిసత్వం ఎలా అవుతుంది?" అని తను అంటే —

"అది మనం ఎదగకుండా చేయడానికి ఈ పురుషజాతి పన్నిన కుట్ర" అనేది.

"ఇది మానసిక అపరిపక్వత అనుకోవాలా... ఆచరణలోని - జీవితసత్యాలను అర్థంచేసుకోలేని ఆవేశమనుకోవాలా... వీళ్లెందుకిలా ఆలోచిస్తున్నారు? రేఖలో ఇటువంటి తీవ్రవాద ధోరణులు అంకురించడానికి కారణం ఏమిటి? తన పెంపకంలోని

లోపమా...? ఇది ఒక విధంగా తను చేసిన తప్పేనా?'' మీనాక్షికేమీ పాలుపోవడంలేదు.

ఆయన చూస్తే - వ్యసనాలకు బానిస. ఎంతసేపూ ఏదో రకంగా డబ్బొస్తేచాలు.. అది తన పేకాటకు, తాగుడుకు సరిపోతూవుంటే, ఎవరు ఎలాపోయినా ఫరవాలేదనుకుంటాడు.

ఆ మనిషి ఇక రేఖ కాపురం గురించి ఏం పట్టించుకుంటాడు?

రేఖను తలచుకుంటూ వుంటే, ఆమెకు కన్నీళ్లు ఆగలేదు!

''మీనాక్షీ....''

ఆమె వంటగదిలోంచి హాల్లోకి వచ్చింది.

భర్త నోట్లు లెక్కపెడుతున్నాడు.

కొంపతీసి, ఈయనకాని, రేఖ పనిచేస్తున్న ఆఫీసుకు వెళ్లి, ఆ జీతం డబ్బు కాస్తా తెచ్చేయలేదు కదా...?

''చూడు మీనాక్షీ... మొత్తానికి రేఖ మనకు మగపిల్లవాడు లేనిలోటు తీర్చింది... ఆ ఆనందరావు ఎలా పోయినా మనకేంగాని... వచ్చిన రెండో రోజే మంచి ఉద్యోగం సంపాయించుకుంది. చూడు... ఇవాళ.... పదిహేను వందల రూపాయల జీతం అలాగే యిచ్చేసింది. ఏదో మీటింగ్ వుందట. ఇంటికి కాస్త ఆలస్యంగా వస్తానంది..... ఇదిగో ఈ ఐదువందలు ఇంటి ఖర్చులకు వాడు.... ఈ వెయ్యి రూపాయలు నీకు మరో వారం రోజుల్లో రెండు వేలుగా యిస్తాను.... సరేనా?'' నవ్వడానికి ప్రయత్నించాడు రేఖతండ్రి నారాయణరావు.

''ఏమండీ... మీకు ఏమైనా న్యాయంగా వుందా. కూతురు - కాపురాన్ని వదిలేసుకుని వస్తే - వాళ్ల మధ్య రాజీకుదర్చడానికి ప్రయత్నించకుండా, దానిచేత ఉద్యోగం చేయిస్తున్నారు... జీతం వాడుకుంటున్నారు.... మీకు అసలు మనసనేది వుందా?'' అతని 'మూడ్' బావున్నట్లు లేకపోయినా ధైర్యంచేసి అడిగింది మీనాక్షి.

''ఓసి పిచ్చి మొద్దూ... ఈ రోజుల్లో మనసుంటే ప్రయోజనం లేదు. డబ్బు వుండాలి. డబ్బుకోసం-అవసరమైతే - మనసును చంపుకోవాలి...''

''అంటే... డబ్బుకోసమని - రేపెప్పుడైనా రేఖచేత తప్పుడు పనులు చేయించడానికి కూడా సిద్ధపడతారా?'' ఆవేశంగా అడిగింది మీనాక్షి.

అప్పుడే ఇంట్లోకి రాబోతున్న రేఖ - తన ప్రస్తావన వచ్చేసరికి గుమ్మం దగ్గరే ఆగిపోయింది....

''ఏమిటీ... ఏది తప్పు? ఏది రైటు? నువ్వింకా పాతకాలపు ధర్మ శాస్త్రాలు వల్లిస్తున్నావు.... బయట ప్రపంచాన్ని కాస్త చూడు.... ఆడవాళ్లు ఎంత అడ్వాన్సుగా వెళ్లిపోతున్నారో.... 'అసలు పెళ్లికాకుండానే పిల్లల్ని కని పెంచుకోవచ్చు'... అంటున్నారు. 'మగవాడు ఇష్టపడి తప్పుచేస్తే అది తప్పుకాదు మగతనం అని మెచ్చుకున్నప్పుడు, మేము చేస్తే మాత్రం అది తప్పెలా అవుతుంది?' అని రేపు నీ కూతురు రేఖ అడిగిందే అనుకో... అప్పుడేం చెబుతావు... అంచేత ఏవేవో వూహించుకుని మనసు పాడుచేసుకోకు... డబ్బు సంపాయించడానికి ఎవరు ఏం చేసినా తప్పులేదు'' అని రూపాయినోట్లు బలవంతంగా మీనాక్షి చేతిలోపెట్టి - ఈలుకుంటూ తనగదిలోకి వెళ్లిపోయాడు నారాయణరావు.

రేఖ తండ్రి మాటలు వింటూ స్థాణువులా, నిలబడిపోయింది!

[ఇదీ కథంటే, ఈ కథకు 'ముగింపు' లేదు. సరైన పరిష్కారం చూపలేదు' అని విమర్శించే పాఠకులు కూడా వుంటారు. నిజానికి కొన్ని జీవిత కథలకు పరిష్కారాలనేవి దొరకవు. ఎన్నో కఠినమైన సమస్యలు కూడా - మనసుల్లో అంతర్లీనంగా ఎక్కడోవున్న ఆర్ద్రత వల్ల పరిష్కారమౌతాయి. మరికొన్నిటిని కాలమే పరిష్కరిస్తుంది!

కాని రేఖ సమస్య ఎలా పరిష్కారమౌతుంది?

ఆనందరావు, మీనాక్షి, నారాయణరావు... వీళ్లలో ఒక్కొక్కరు ఒకో కోణంలో రేఖ గురించి ఆలోచించారు.

కానీ రేఖ ఆలోచనా ధోరణి ఏమిటి?

'రేఖ - సరళ రేఖగా మిగులుతుందా? వక్రరేఖ అవుతుందా'? అని చర్చించడం ఈ కథ ఉద్దేశంకాదు.

కానీ కొందరు వ్యక్తులు పరాన్న భుక్కులుగా జీవించడానికి రేఖలాంటి వ్యక్తులు దోహదం చేస్తున్నారు. అవతలి వాళ్లను బ్రతికించడంలో రేఖలు శలభాల్లా మాడిపోతున్నారు. 'తమ జీవితాలు అర్థరహితంగా మిగిలిపోయాయి' అని గ్రహించేసరికి - అంతిమదశకు చేరుకుంటున్నారు. అలా జరగకుండా రేఖలు, అర్థవంతమైన సరళరేఖలుగా నిలదొక్కుకోవాలంటే, ఏం చేయాలో ఆలోచించమని చెప్పడానికే ఈ కథ!]


